www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 9 ఏప్రిల్ 2024 | 8 పేజీలు



వైఎస్ఆర్



అన్నమయ్య

రైతులను మోసగించిన సిఎం జగన్

బస్సుయాత్రలో వైఎస్.షర్మిల



బ్రహ్మంగారిమఠం : ప్రజలకు అభివాదం తెలియజేస్తున్న వై.ఎస్.షర్మిల

ప్రజాశక్తి-బ్రహ్మంగారిమఠం/ఖాజీపేట/చాపాడు/మైదుకూరు/దువ్వూరు

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతులను నమ్మించి మోసం చేశారని పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల అన్నారు. సోమవారం వైఎస్ఆర్ జిల్లా మైదుకూరు నియోజవకర్గంలోని బ్రహ్మంగారిమఠం, దువ్వూరు, చాపాడు, ఖాజీపేట, మైదుకూరులో నాలుగో రోజు ఆమె బస్సుయాత్రను ప్రారంభించారు. బస్సుయాత్ర సందర్భంగా షర్మిల మాట్లాడుతూ వైసిపి పాలనలో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ధరల స్థిరీకరణ అని చెప్పి జగన్ రైతులను మోసం చేశారన్నారు. వైయస్సార్ హయాంలో రైతే రారాజు ఇప్పుడు అప్పులేని రైతు లేడని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టం జరిగితే రూపాయి కూడా పరిహారం రావడం లేదు. సబ్సిడీలో డ్రిప్పు వేసుకోవడానికి అవకాశం లేకుండా సబ్సిడీలు అన్ని ఆపేశారని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తామని చెప్పి ఇంత వరుకు తేలేదని విమర్శించారు. కడప ఉక్కు పరిశ్రమ శంకుస్థాపన జరిగి ఏళ్ళ అవుతున్నా పనుల ఊసే లేదన్నారు. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో ఆధారాలు ఉన్నా కడప ఎంపీ అవినాష్‌రెడ్డిని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కాపాడుతున్నారని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆశయాలకు జగన్ పరిపాలనకు ఏ మాత్రం సాటికాదని పేర్కొన్నారు. వైఎస్ఆర్ పాలనతో జగన్ పాలనకు పొంతనే లేదన్నారు. భూతద్దం పెట్టి చూసినా ఆ ఆనవాళ్లు కనిపించని చెప్పారు. మాజీ మంత్రి వివేక హత్య కేసులో ఎంపీ అవినాష్‌రెడ్డి 2లో

ఎపిఎండిసి అసిస్టెంట్ మేనేజర్‌ను సస్పెండ్ చేయాలి : సిపిఎం

2లో...

రాజంపేట వైసిపిలో
భారీ కుదుపు

- మూడు మండలాల కేడర్ టిడిపిలోకి!
- లోకేష్ సమక్షంలో చేరికలు
- వైసిపి నాయకత్వానికి అసంతృప్తుల సెగ

వైసిపిలో అసంతృప్తి బుసలు కొడుతోంది. ఉమ్మడి కడప జిల్లాలోని రాజంపేట నియోజకవర్గంలో అసంతృప్తుల సెగ తారాస్థాయికి చేరుకుంది. గతేడాది కిందట జిల్లాల పునర్విభజనలో పార్లమెంట్ కేంద్రాన్ని జిల్లా కేంద్రంగా మారుస్తామనే ముఖ్యమంత్రి హామీని ఉల్లంఘించడం, సిట్టింగ్ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి టికెట్ నిరాకరించడం, ఎమ్మెల్యే మేడా, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అనుచరుల మధ్య మొదటి నుంచి పొసగకపోవడం వంటి కారణాలతో నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఎమ్మెల్యే ప్రధాన అనుచరులుగా ముద్రపడిన ద్వితీయశ్రేణి కేడర్ లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరారు. తాజా పరిణామం వైసిపి అభ్యర్థి ఆకేపాటి అమరనాధరెడ్డి గెలుపునకు సవాల్‌గా మారిందని చెప్పవచ్చు. 2లో



నారా లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరుతున్న వైసిపి నాయకులు

పెండ్లిమర్రి కానిస్టేబుల్ సస్పెన్షన్

- కారును అద్దెకు తీసుకుని తాకట్టు పెట్టినందుకు వేటు
- పోలీసు శాఖ ప్రతిష్టను దెబ్బతీస్తే కఠిన చర్యలు : ఎస్‌పి



కానిస్టేబుల్ రామయ్య

2లో

తాగునీటి ఎద్దడిపై
ప్రత్యేక దృష్టి సారించాలి

అన్నమయ్య జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



అధికారులనుద్ధేశించి మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అభిషిక్త కిషోర్ అధికారులకు చూచించారు. సోమవారం విజయవాడ, ఎపి సెక్రటేరియట్‌లోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, ఎంజిఎన్ఆర్ఇజిఎస్, వేసవిలో విద్యుత్ సరఫరా, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్. జవహర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డ్వామా పీడీ మద్దిలేటి, అర్ డబ్ల్యూఎస్ ఎస్ఇ సురేష్ కుమార్ హాజరయ్యారు. విసి అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో జిల్లాలో నెలకొన్న తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో మొత్తం 5450 హ్యాబిటేషన్స్ ఉన్నాయని నీటి సమస్య ఉన్న గ్రామాలలో యుద్ధప్రాది పదికన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రస్తుతం అవసరమైన గ్రామాలలో వెంటనే టాంకర్‌ల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. ముఖ్యంగా లక్కిరెడ్డిపల్లె, మండలంలో నెలకొన్న తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక చొరవ చూపాలన్నారు. జిల్లాలో 2లో

రంజాన్ వేళలు



ఇఫ్తార్	షహారీ
మంగళవారం (సా)	బుధవారం (ఉ)
6.31	4.50

తాగునీటి ఎద్దడిపై..

(మొదటిపేజీ తరువాయి) రామాపురం, గాలివీడు, రాయచోటి, సంబేపల్లి, చిన్నమండెం, సుండుపల్లె, బి కొత్తకోట, తంబళ్లపల్లె, మండలాలలో నీటి సమస్య ఉందని ఇక్కడ తాగునీటి ఎద్దడి రాకుండా తగిన కార్యాచరణ ప్రణాళికల రూపొందించుకొని ముందుకు వెళ్లాలన్నారు. గ్రామపంచాయతీలు, హ్యాబిటేషన్లు, మున్సిపాలిటీ పరిధిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు రోజూ పర్యవేక్షణ చేయాలన్నారు. ఏప్రిల్, మే, జూన్, ఈ మూడు నెలలు క్షేత్రస్థాయిలో తాగునీటి సమస్య రాకుండా అధికారులు యాక్టివ్‌గా ఉండాలన్నారు. ప్రతి గ్రామంలో చివరి ఇంటి వరకు తాగునీటి సరఫరా చేయాలని, చివరి ఇళ్ల వరకు నీరు సరఫరా అవుతోందా లేదా అనేదికూడా పరిశీలన చేయాలన్నారు. జిల్లాలోని తాగునీటి పథకాలను పరిశీలించి ఎక్కడైనా మరమ్మతులకు గురై ఉంటే వెంటనే చేపట్టాలని, ఇందులో ముఖ్యంగా పైప్‌లైన్ల లీకేజీలు, బోర్లు బాగు చేయాలన్నారు. ప్రజలు నీటి సమస్య పరిష్కారానికి ఆర్డబ్ల్యూఎస్ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్ 9032430230 కి ఫోన్ చేసి నీటి సమస్య పరిష్కరించుకోవాలన్నారు. తాగునీటి కోసం విద్యుత్ సమస్య తలెత్తకుండా చూడాలని ఎపిఎస్‌పిడిసిఎల్ అధికారులను ఆదేశించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన పేదలందరికీ జాబ్ కార్డులు మంజూరు చేసి పని కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని పేదల కోసం సమర్ధ వంతంగా నిర్వహిస్తోందని ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు మెరుగైన జీవనోపాధి కల్పించే విధంగా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. పనిచేసే ప్రాంతంలో కూలీలకు ప్రభుత్వ నియమ నిబంధన ప్రకారం నీరు, సేమియానా, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, వంటి అన్ని వసతులు ఉండేటట్లు చూడాలన్నారు.

రైతులను మోసగించిన సిఎం జగన్

(మొదటిపేజీ తరువాయి) నిందితుడని సిబిఐ చెప్పిందని, కాల్ రికార్డులు, గూగుల్ మ్యాప్స్, లావాదేవీలు ఉన్నట్లు పేర్కొందని గుర్తు చేశారు. అన్ని ఆధారాలున్నా అతనిని జగన్ కాపాడుతూ వస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంపూర్ణ మద్య నిషేధమని హామీ ఇచ్చి ప్రభుత్వం మద్యం విక్రయిస్తూ ఇష్టాను రీతిగా ధరలతో అమ్ముతూ వివిధ రకాల బ్రాండ్ల పేరుతో కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీస్తున్నారన్నారు. 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తానని జగన్ హామీ ఇచ్చారని తెలిపారు. మెగా డీఎస్సీ వేస్తామని చెప్పారని, నాలుగున్నర సంవత్సరాలు నిద్రపోయి కేవలం ఆరు వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారని పేర్కొన్నారు. మూడు నెలల క్రితం నోటిఫికేషన్ వదలడం దేనికి నిదర్శనమన్నారు. జగన్ ది హత్య రాజకీయాలు చేసే పాలనన్నారు. సొంత బాబాయిని చంపిన నిందితులను కాపాడుతున్నారని తెలిపారు. వారికే టికెట్ ఇస్తున్నారని, హంతకులు చట్ట సభలలో వెళ్ళకూడదని అన్యాయాన్ని ఎదిరించేందుకే ఎంపీగా పోటీ చేస్తున్నానని పేర్కొన్నారు..న్యాయం కోసం పోరాటం ఓవైపు అంతకులు మరోవైపు ప్రజలు ఎవరిని గెలిపిస్తారో ఆలోచించాలన్నారు. అంతకులకు ఓటు వేయద్దు వైయస్సార్ బిడ్డను గెలిపించాలని కోరుతున్నా, ఏ కష్టం వచ్చినా అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. డాక్టర్ సునీత మాట్లాడుతూ ఆడదే అంటే నారి శక్తి అని అన్నారు. తమను అలాగే పెంచారని చెప్పారు. తప్పు ఉంటే తప్పు అని చెప్పే మనస్సు నాది వివేకాను ఎవరు హత్య చేశారో అందరికీ తెలుసు న్యాయం కోసం పోరాడుతున్నామని తెలిపారు. నాన్నను చంపి మమ్మల్ని రోడ్లపాలు చేశారన్నారు. షర్మిలను ఎంపీగా చూడాలనేది వివేకా కోరిక ప్రజలు భారీ మెజార్టీతో షర్మిలను గెలిపించాలని ప్రజలను కోరుతున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి, డిసిసి అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు పాల్గొన్నారు.

షర్మిల సభలో జగన్ నినాదాలు

దువ్వూరులో షర్మిల బస్సుయాత్ర సందర్భంగా నిర్వహించిన సభలో జై జగన్ అంటూ కొందరు నినాదాలు చేశారు. సభలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ఏమి చేశారో చెప్పాలని షర్మిల ప్రశ్నించగా దీనికి స్పందించిన జగన్ అభిమాని చంద్ర ఓబుల్‌రెడ్డి సిఎం జగన్ అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. జోహార్ వైయస్సార్, జై జగన్ అంటూ నినాదాలు చేశాడు.

రాజంపేట వైసిపిలో భారీ కుదుపు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాజంపేట వైసిపిలో భారీ కుదుపు నెలకొంది. సిట్టింగ్ ఎమ్మెల్యే మేడా, జిల్లా పరిషత్ చైర్మన్ అనుచరుల మధ్య సయోధ్య పొసగని నేపథ్యమే కుదుపునకు ప్రధాన కారణమని తెలుస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల సన్నాహక ప్రయత్నంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇంటింటికి ప్రభుత్వం పేరుతో ఎమ్మెల్యేలను ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకుని, ప్రభుత్వం అందించిన చేయూతను వివరించాలనే కార్యక్రమాన్ని తీసుకున్న సంగతి తెలిసిందే. ఎమ్మెల్యేలను ఇంటింటికీ పంపించారు. ఎమ్మెల్యేల పనితీరు ఆధారంగా ర్యాకింగ్‌ను ఇవ్వడం, వెనుకబడిన ఎమ్మెల్యేలను హెచ్చరించడం, తప్పును దిద్దుకునే అవకాశాల్ని కల్పించారు. సిట్టింగ్ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి వెనుక బడినట్లు తేలింది. ముఖ్యమంత్రి రాజంపేట ఎమ్మెల్యేను పలుమార్లు హెచ్చరించారు. సిట్టింగ్ ఎమ్యెల్యే ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాని నేపథ్యంలో సర్వేనుసారంగా టికెట్ నిరాకరించారు. దీన్ని ఎమ్మెల్యే అనుచరులు జీర్ణించుకోని నేపథ్యం తాజా పరిణామానికి దారితీసిందనే చర్చ నడుస్తోంది.

హామీ ఉల్లంఘనే కారణమా

ప్రతి పార్లమెంట్ కేంద్రాన్ని జిల్లా కేంద్రంగా మారుస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హామీనిచ్చిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలి. రాయచోటిని జిల్లా కేంద్రంగా చేయడంతో రాజంపేట మున్సిపల్ కౌన్సిలర్ల దగ్గర నుంచి ద్వితీయశ్రేణి కేడర్ రాజీనామాలతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. రాజంపేటకు మెడికల్ కళాశాల కేటాయించాలనే డిమాండ్ ఎప్పటినుంచో ఉంది. మెడికల్ కళాశాల డిమాండ్‌ను సైతం నెర వేర్చిన దాఖలాల్లేవు. ఒంటిమిట్ట మండలం తప్పెట వారిపల్లి, సాలాబాదుల్లో శంకుస్థాపన గోడపత్రంలో పేర్ల నమోదులో మేడా, ఆకేపాటి అనుచరుల మధ్య తీవ్ర వివాదం నెలకొంది. నెల రోజుల కిందట వీరబల్లి మండల నాయకులు ఆకేపాటి అమరనాధరెడ్డికి ఎన్నికల్లో సహకరించే ఇచ్చే ప్రసక్తే లేదనే తేల్చేసిన నేపథ్యంలో తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. నియోజకవర్గంలోని మిగిలిన మండలాలైన సుండుపల్లి, నందలూరు, సిద్ధవటం మండలాల కేడర్ నుంచి వైసిపి అభ్యర్థి ఆకేపాటి అమరనాధరెడ్డికి వైసిపి కేడర్ నుంచి సహాయ నిరాకరణ ఎదురవుతుండడం చర్చనీయాంశంగా మారింది.

టిడిపిలోకి భారీగా చేరికలు

సార్వత్రిక పోలింగ్‌కు ముంగిట రాజంపేట పెనుమార్పుకు లోనవుతోంది. రాజంపేట, ఒంటిమిట్ట, సుండుపల్లి, వీరబల్లి మండలాల నుంచి వందలాది మంది వైసిపి క్రియాశీల కార్యకర్తలు టిడిపిలో చేరడానికి సమాయత్తం కావడం చర్చనీయాంశంగా మారింది. విజయవాడలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేస్ కలవడానికి పెద్దఎత్తున వాహనాల్లో బయల్దేరారు. లోకేష్ సమక్షంలో టిడిపి కండువా వేసుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా వందలాది మంది క్రియాశీలక కార్యకర్తలు పార్టీని వీడిన నేపథ్యంలో వైసిపి నాయకత్వం ఆలోచనలో పడినట్లు తెలుస్తోంది. మూడేళ్ల కిందట అన్నమయ్య రిజర్వాయర్ తెగడానికి రాజకీయ నాయకుల ఇసుకడంపులే ముంపునకు, చావులకు కారణమనే విమర్శలు పెద్ద ఎత్తున ఉన్న సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో వైసిపి అభ్యర్థి పరిస్థితి కుడిలో పడిన ఎలుక చందంగా మారినట్లు కనిపిస్తోంది.

ఎపిఎండిసి అసిస్టెంట్ మేనేజర్‌ను సస్పెండ్ చేయాలి

- సిపిఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, ప్రజాసంఘాల నేతల డిమాండ్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఎపిఎండిసి సంస్థ మంగంపేట బ్రాంచ్‌లో అసిస్టెంట్ మేనేజర్ హెచ్‌ఆర్‌డిగా విధులు నిర్వ ర్తిస్తున్న నారాయణరెడ్డి అవినీతి పరా కాష్టకు చేరిందని సిపిఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసిస్టెంట్ మేనేజర్ హెచ్‌ఆర్‌డికి సంబంధించిన వ్యక్తులు సెలవు కాగితం పెట్టినా సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేయకుండా నెల అటెండెన్స్ పూర్తిగా వేయటం వల్ల ఆ ఉద్యోగులు సరిగా విధులకు హాజరు కాకుండా ఎప్పుడూ సెలవులపైన ఉంటున్నారని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న సిపిఒసర్వీస్ రిజిస్టర్ పరిశీలించగా ఆయన కొన్ని నెలలుగా, సంవత్సరాలుగా సంతకాలు పెట్టలేదని తెలిసిందని తెలిపారు. ఈ విషయం యూనియన్‌గా సిపిఒ అడగగా సంతకాలు పెట్టలేదనేది వాస్తవం అని ఆయన తెలిపారు, దీనిపైన విచారణ చేసి బయోమెట్రిక్ ఫింగర్ ప్రింట్స్, వారి సెక్షన్ అలాట్మెంట్, జీతాల హాజరు విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చీఫ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కలెక్టర్ ఆఫీస్‌కు కానీ బయటకు కానీ వెళితే హాఫ్ డే సెలవు కాగితం పెట్టి వెళ్ళిపోతారని విమర్శించారు. సిపిఒ మెడికల్ బిల్లులు చూసుకోమని అసిస్టెంట్ మేనేజర్ హెచ్‌ఆర్‌డి ఆర్డర్ ఇస్తే ఆయన వారి సతీమణికి హాస్పి టల్‌లో చూపించకుండా బిల్లులు మం జూరు చేసుకున్నారు. ఇంక కొంత మంది కార్మికులకు ఆశ చూపించి వారి కార్డ్స్ ఇప్పించుకుని లక్షల్లో డబ్బులు మెడికల్ ఇన్సూరెన్స్ వారి ద్వారా వసూలు చేస నట్లు ఆధారాలున్నాయని చెప్పారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. రామాంజులు మాట్లాడుతూ గతంలో సిపిఒగా ఉన్న కేదార్ నాథ్‌రెడ్డి ఓ జనరల్ ఏసీలు తెప్పించారని, ఆయన సిపిఒగా వెళ్ళిపోయిన తరువాత ఓ జనరల్ ఎసిలను కొంతమంది ఇళ్లకు చేరవేసి అవి పాడై పోయాయాని తప్పుడు నివేదిక ఇచ్చారని వాపోయారు. ఇది సంస్థకు నష్టం చేకూర్చడమేనని తెలిపారు. మంగంపేట బ్రాంచ్‌లో టెండర్లు వేస్తే అతనికి ముందుగానే తెలుస్తుందని, అధికారాన్ని అడ్డుపెట్టుకుని అతని బినామీలను రప్పించి టెండర్లు వేయిస్తూ అధికార దుర్వియోగానికి పాల్పడు తున్నారని తెలిపారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె. నాగబసిరెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి యస్. రామచంద్ర, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి. ప్రభాకర్‌రెడ్డి, హమాలీ సంఘం నాయకులు జి మాధవయ్య పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పి. శ్రీనివాసులు

పెండ్లిమర్రి కానిస్టేబుల్ సస్పెన్షన్

ప్రజాశక్తి - కడప అర్బన్

కారును అద్దెకు తీసుకుని మరొకరి వద్ద తాకట్టు పెట్టి యజమానిని మోసం చేసిన వ్యవహారంలో కానిస్టేబుల్ రామయ్యను ఎస్పి సిద్ధార్థ కౌశల్ సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసుశాఖ ప్రతిష్టను ప్రజలలో దెబ్బతినేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పి హెచ్చరించారు. పెండ్లిమర్రి పోలీస్ స్టేషన్‌లో రామయ్య (పిసి 856) కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు ఆయన బద్వేలుకు చెందిన కారు యజమాని వద్ద టయోట ఇతియోస్ కారు అద్దెకు తీసుకున్నారు. కారు గురించి యజ మానికి రోజు అడుగుతుంటే కానిస్టేబుల్ నేడు, రేపు అంటూ కట్టు కథలు చెబుతూ వచ్చారు. దీంతో కారు యజమాని బద్వేల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణలో కానిస్టేబుల్ అద్దెకు తీసుకున్న కారును మరొకరి వద్ద తాకట్టు పెట్టినట్లు తేలింది. దీనిని ఎస్పి తీవ్రంగా పరిగణించారు. తక్షణమే సస్పెండ్ చేశారు. కానిస్టేబుల్‌పై క్రమశిక్షణ చర్యలతో పాటు కారు యజమాని ఫిర్యాదుపై బద్వేల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణకు ఆదేశించారు.

సెయింట్ ఆంటోనీ స్కూల్‌లో ముందస్తు ఉగాది, రంజాన్ వేడుకలు

ప్రజాశక్తి-కలసపాడు

స్థానిక సెయింట్ ఆంటోనీ పాఠశాలలో సోమవారం ముందస్తు ఉగాది, రంజాన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ చిత్త రాజశేఖర్ రెడ్డిమాట్లాడుతూ, మతసామరస్యానికి సమైక్యతకు, ప్రతీకగా ప్రతి సంవత్సరమూ అన్ని పండుగలను ఘనంగా నిర్వహిస్తూ విద్యార్థులకు వాటి ప్రాముఖ్యతను తెలియజేస్తున్నామని చెప్పారు. అనంతరం చిన్నారులు తెలుగు సంప్రదాయ దుస్తులతో అందరిని అలరించారు. ముస్లిం సోదరులు కూడా, తమ సాంప్రదాయ దుస్తులతో, కవాలి పాటలతో ఆకట్టుకున్నారు. అనంతరం ముందుగా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. హిందూ సోదరులకు షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని అందరికీ అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చిత్తా ప్రభావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలతో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక అని బద్వేల్ నియోజకవర్గపు అదనపు సమన్వయకర్త విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు ముస్లిం సోదరులతో కలిసి నమాజ్ చేసి ఇఫ్తార్ విందులో పాల్గొని ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరులకు రోజ విడిపించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో హిందూ ముస్లిం భాయి భాయి అనే నినాదంతోనే ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు బాలగురివి రెడ్డి, ప్రభు, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో విశ్వనాథరెడ్డి, ముస్లిములు

అక్షయ నర్సింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని దేవుని కడప రోడ్డులో ఉన్న అక్షయ నర్సింగ్‌లో కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వ హించారు. ముఖ్యఅతిథిగా అడిషనల్ డిఎంహెచ్ఒ ఉమామహేశ్వర రావు హాజయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సింగ్ కోర్స్ వైద్యారోగ్య శాఖలో ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. వీరిని కుటుంబ సభ్యులుగా భావిస్తామని చెప్పారు. బిఎస్‌సి నర్సింగ్ కోర్సు నాలుగున్నరేళ్ల ఉంటుందని పేర్కొన్నారు. ఎంబిబిఎస్‌తో సమానంగా చదవాలన్నారు. వైద్యశాఖలో ఉన్నవారు నిత్య విద్యార్థి అని, ప్రతిసారి ఏదో ఒకటి నేర్చుకుంటే ఉండాలని తెలిపారు. భవిష్యత్తులో ఆశించిన స్థాయికి చేరు కోవడానికి దోహదపడతాయని చెప్పారు. సీనియర్లతో పరిచయం పెంచుకోవాలని తెలిపారు. ఉద్యోగ అవకాశాలు ఎన్నో ఉన్నాయని పేర్కొన్నారు. కష్టపడండి, మంచి మార్కులు తెచ్చుకోండని సూచించారు. దేశంలో నర్సింగ్ డిమాండ్ ఎక్కువగా ఉందని చెప్పారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. శారద కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ డాక్టర్ నరేంద్ర బాబు మాట్లాడుతూ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలిపారు. నర్సులు పేషంట్ వద్ద చిరునవ్వుతో ఉండాలని చెప్పారు. కుల మతాలు చూడకుండా నైటింగేల్ నర్సింగ్ సేవలందించిందని గుర్తు చేశారు. జిల్లాలో అక్షయ నర్సింగ్ కాలేజీ మంచి గుర్తింపు ఉందని తెలిపారు. కళాశాలకు ఎలాంటి చెడ్డపేరు తేవద్దని పేర్కొన్నారు. అక్షయ నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపల్ సుభాషిని మాట్లాడుతూ అన్ని రంగాల్లో విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. కళాశాల యాజమాన్యం అన్ని సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. నిర్మల కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ అరుణ్ మాట్లాడుతూ నర్సింగ్ సేవలు మానవత్వ సంబంధాలు కలిగి ఉంటాయని పేర్కొన్నారు.. జూనియర్స్ సీనియర్స్ మధ్య సంబంధాలు ఉండాలని చెప్పారు. కరస్పాండెంట్ విజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తీపి చేదు అనుభవాలను ఎదుర్కోవాల్సిందే అన్నారు పేషంట్ దగ్గరికి పోయి వాళ్ళని పలకరించి, ధైర్యం చెప్పాలన్నారు. ఒకటికి రెండుసార్లు పలకరించడంతోని వాళ్ళ వ్యాధి సగము నయమవుతందని తెలిపారు. డాక్టర్ కంటే ఎక్కువ నర్సులు పేషంట్ల వద్ద ఉంటారని పేర్కొన్నారు. ఈ నాలుగు సంవత్సరాలు చదివితే 40 ఏళ్ల జీవితం అనేది చాలా బాగుంటుందని చెప్పారు. కాలేజీకి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వార్షికోత్సవ వేడుకల్లో కళాశాల యాజమాన్యం, అతిథులు

తిరుపాలయ్య మృతికి సిపిఎం నివాళి

ప్రజాశక్తి - కడప అర్బన్

సిపిఎం జిల్లా కమిటీ మాజీ సభ్యులు తిరుపాలయ్య హఠాత్ మరణానికి సిపిఎం జిల్లా కమిటీ నివాళులు అర్పిస్తుందని జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, మాజీ కార్యదర్శి బి.నారాయణ వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. సిపిఎం ప్రారంభ రోజుల్లో పనిచేసిన ముఖ్యుల్లో తిరుపాలయ్య ఒకరని తెలిపారు. నెల్లూరు జిల్లా నుంచి కడప జిల్లాకు పూర్తి కాలం కార్యకర్తగా వచ్చి పని చేస్తున్న కాలంలో సిపిఎం అభిమానులను, మాజీ సభ్యులను, సానుభూతి పరులను, పెద్దలను కలిసి ఒక చోటికి చేర్చి ఒక స్వరూపానికి తీసుకుని రావటంలో నారాయణ సహకారం అందించడంలో కీలకపాత్ర వహించారని పేర్కొన్నారు. ఆయన మృతికి జిల్లా కమిటీ సంతాపం తెలియజేస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటిస్తుందని తెలిపారు. మంచి కార్యకర్తను పోగొట్టుకుందని పేర్కొన్నారు.

సంస్కృతికి ప్రతి రూపం రాష్ట్ర గీతం

ప్రజాశక్తి - కడప అర్బన్

శంకరంబాడి సుందరాచారి రాసిన 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ 'మన రాష్ట్ర గీతం మన సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు రూపమని, తెలుగు నాట ఉన్న ప్రముఖమైన నదులను, సంస్కృతి సాహిత్యాలను,చరిత్రలో ప్రసిద్ధ వ్యక్తులను గీతంలో ఆయన స్మరించారని వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. శంకరంబాడి సుందరాచారి 47 వ వర్ధంతి పురస్కరించుకుని సోమవారం కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో సమావేశాన్ని నిర్వహించారు. మొదట సుందరాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకరంబాడి గొప్ప పద్య కవి అని, ఆయనకు తేటగీతి పద్యం అంటే చాలా ఇష్టమని, దాదాపు ఆయన రచనలు అన్నీ తేటగీతి పద్యాలలోనే రాశారని అన్నారు. ఆయన సుందర రామాయణం, సుందర భాగవతం, శ్రీనివాస శతకం మొదలైన కావ్యాలు, శతకాలు రాశారని, గాంధీ చనిపోయినప్పుడు ఆవేదనతో బలిదానం అనే కావ్యాన్ని రాశారని అన్నారు. రిటైర్డ్ అధ్యాపకులు కవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వర చారి మాట్లాడుతూ సుందరాచారి రాసిన మన రాష్ట్ర గీతాన్ని టంగుటూరి సూర్య కుమారి అద్భుతంగా పాడారని అన్నారు. 2004లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తిరుపతి పట్టణం లో సుందరాచారి జ్ఞాపకార్థం ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, ఆయనకు ప్రసన్న కవి, భావకవి అనే బిరుదులు ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో మందల మురళి,ప్రకాశం,బాల ఓబయ్య, మోతుకూరి పుల్లయ్య పాల్గొన్నారు.

కెఎల్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో పండుగలు

ప్రజాశక్తి - కడప అర్బన్

కెఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో రంజాన్, ఉగాది పండులు సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. మత ప్రబోదకులు అబ్దుల్ రహీం మాట్లాడుతూ రంజాన్ ఉపవాసాలు చేయడం వల్ల రెండు ఉద్దేశాలు నెరవేరుతాయని పేర్కొన్నారు. భయ భక్తులు, పేదవారి ఆకలిని మనం తెలుసుకోవడం అన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి. రత్నమ్మ మాట్లాడుతూ రంజాన్ ముస్లిం సోదరులకు ఎంతో పవిత్రమైందని చెప్పారు. అన్ని మతాలను గౌరవించడం నేర్చుకోవాలని తెలిపారు. క్రోధి నామ ఉగాది వేడుకలు పురస్కరించుకుని షడ్రుచుల సమ్మేళనం ఉగాది అని అన్నారు. ఉగాది కొత్త ఆశల చిగు రించాలని చెప్పారు. ఉగాది పచ్చడి పంచి పెట్టారు. కార్యక్రమంలో అన్నిశాఖల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐ వేధింపులపై చర్యలు తీసుకోవాలి

- ఆర్‌డిఒకు కమ్యూనిటీ నాయకుల వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని టూటౌన్‌లో ఎస్ఐగా పని చేస్తున్న రాయుడు ఈ నెల 6న షబేఖద్ర్ రాత్రి యువకులపై విచక్షణ రహితంగా లాఠీతో చితకబాదరని, వెంటనే చర్యలు తీసుకోవాలని కమ్యూనిటీ లీడర్స్ కోరారు. సోమవారం ఆర్‌డిఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘ సేవకులు, కాంగ్రెస్ నాయకులు సలావుద్దీన్, ఎపి ముస్లిం ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాకీర్ హుస్సేన్, సోషల్ డెమోక్రటిస్ పార్టీ ఆఫ్ ఇండియా జహీరుద్దీన్, ఎంఆర్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు దస్తగిరి, సిరాజ్ బుకారి, తారిక్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు పోలీసులపై నమ్మకం ఎంతో అవసరమని పేర్కొన్నారు. టూటౌన్ ఎస్ఐ లాంటి వారి వల్ల పోలీసులపై ప్రజలలో నమ్మకం తగ్గుతుందని చెప్పారు. శాంతిభద్రత సమస్య తలెత్తే పరిస్థితి ఏర్పడుందని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని, కడప శాంతియుత వాతావరణానిన కాపాండేందుకు ఎస్ఐ పై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.



వినతి పత్రం అందజేస్తున్న సలావుద్దీన్, నాయకులు

డిప్యూటీ సిఎం ఆస్తులు మాత్రమే పెరిగాయి : టిడిపి

ప్రజాశక్తి - కడప అర్బన్

వైసిపి పాలనలో ఎవరైనా ఆస్తులు పెంచుకున్నారంటే అది ఒక డిప్యూటీ సిఎం అంజాద్‌బాష అని, ప్రజలు ఆదాయం భారీగా తగ్గిపోయిందని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, కడప అసెంబ్లీ అభ్యర్థి మాధవి అన్నారు. సోమవారం ద్వారక నగర్‌లోని నియోజక వర్గ కార్యాలయంలో వైసిపి, డిప్యూటీ సిఎం పాలనపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలనలో సంక్షేమ పథకాలు అవినీతిమయమైందని చెప్పారు. భూ కబ్జాలు, భూ దందాల్లో బాగా పరిష్కారాలు వికటించి నడిరోడ్డుపై హత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. టిడిపి అధికారంలోకి రాగానే అన్యాక్రాంతమైన భూములపై సిట్ వేసి స్వాధీనం చేసుకుంటామని పేర్కొన్నారు. డిప్యూటీ సిఎం అంజాద్ బాష, ఆయన తమ్ముడు అహమ్మద్ బాష ప్రజలను బెదిరించే విధంగా ఇసుక, మట్టి, భూ కబ్జాలు చేస్తున్నారని చెప్పారు. ఇటువంటి వ్యక్తులను జిల్లా, రాష్ట్రం నుంచి బహిష్కరించాలని తెలిపారు. కడప పార్లమెంట్ అభ్యర్థి భూపేష్ రెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్ మూడు సార్లు ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన చేశారని పేర్కొన్నారు. టిడ్కో ఇళ్లకు వైసిపి రంగులు కొట్టారుగాని, ఇంతవరకు లబ్ధిదారులకు అందించలేదని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు బుగ్గవంక అడ్డాగా మార్చారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్; బిజెపి నాయకులు లక్ష్మణరావు, పద్మాబాయ్, అంబికా, జనసేన నాయకులు మాలే శివ పాల్గొన్నారు.

ఎండలకు అందరూ జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంప్రసాద్

ప్రజాశక్తి- గోపవరం

ప్రస్తుతం ఎండలు భగభగ మండుతున్నాయని, చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని బద్వేల్ సీమాంక్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ.. ఇంట్లో వాతావరణం చల్లగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఎండలోకి తప్పనిసరిగా వెళ్లేవారు సన్‌స్క్రీన్ లోషన్స్ తప్పనిసరిగా వాడాలన్నారు. పండ్ల రసాలు, కొబ్బరి నీళ్ల తాగడం ఆరోగ్యానికి మంచిదని తెలిపారు. రోజుకు కనీసం నాలుగు లీటర్ల మంచినీరు తప్పక తీసుకోవాలని సూచించారు. ఒంటికి వదులుగా ఉండే దుస్తులు ధరించాలని, ఎండలో ప్రయాణించే వారు గొడుగు, హెల్మెట్, గ్లౌజ్‌లు వాడాని పేర్కొన్నారు.. తీసుకునే ఆహారంలో తగినంత ఉప్పు, నీరు, పోషక విలువలు ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా పసి పిల్లలపై ఎండ ప్రభావం పడకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. సూర్యరశ్మికి బహిర్గతమైనపుడు సోడియం వంటి ఎలక్ట్రోలైట్ వంటి ద్రావణాలను తాగడం మంచిదని చెప్పారు. వేసవి కాలంలో వాంతులు, అలసట, బలహీనంగా కనిపించటం, తలనొప్పి, కండరాలలో తిమ్మిరులు, మైకం వంటి లక్షణాలు బహిర్గతమైన వెంటనే వైద్యుడిని సంప్రదించి, తగిన చికిత్స చేపించుకోవటం చాలా మంచిదని, ఇలాంటి జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డాక్టర్ రాంప్రసాద్ పేర్కొన్నారు.

ప్రయివేట్ ఉపాధ్యాయులకు వేతనాలివ్వాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలోని ప్రయివేట్ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 12 నెలల వేతనం ఇవ్వాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రయివేట్ విద్యా సంస్థల అభివృద్ధిలో కీలక భూమికను పోషిస్తున్న ఉపాధ్యాయులకు యాజమాన్యాలు తగిన రీతిలో ఆదుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యా సంస్థలలో వచ్చే సంవత్సరిక వార్షిక ఆదాయంలో 30 శాతం అభివృద్ధికి, పాఠశాల ఉపాధ్యాయులు ఖర్చు చేయాలని ఉందని, కానీ ఒక్క ప్రయివేట్ విద్యా సంస్థల యజమాన్యాలు పాటించడం లేదని వాపోయారు. పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు వద్ద 12 నెలల ఫీజులు రాబట్టి అందులో పని చేస్తున్న ఉపాధ్యాయులకు 10 నెలల జీతంతో సరిపెడుతున్నారని పేర్కొన్నారు. విద్యా సంస్థలలో ఉపాధ్యాయ వృత్తినే నమ్ముకొని ఆధారపడ్డ కుటుంబాలకు రెండు నెలల జీతం లేకుంటే వారి పరిస్థితి ఏమిటని అన్నారు. మళ్ళీ వారిని అడ్మిషన్ల పేరుతో కార్పొరేటు విద్యా సంస్థలు వేధిస్తున్నారని వాపోయారు. మండుటెండల్లో పాఠశాలల అడ్మిషన్ల కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించాలని హుకుం జారి చేస్తున్నారని, లేకుంటే ఉద్యోగం నుంచి తొలగిస్తున్నారని చెప్పారు. కనీసం పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలకు కూడా ప్రయివేటు ఉపాధ్యాయులు నోచుకోవడం లేదన్నారు. ప్రయివేట్ ఉపాధ్యాయుల అభివృద్ధికి పాటు పడతారని చెప్పినటువంటి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ విద్యాసంస్థలో కూడా ఇవేవీ అమలు కావడం లేదని విమర్శించారు. ప్రయివేట్ ఉపాధ్యాయులకు పూర్తి 12 నెలలు జీతం ఇవ్వాలని వారి సమస్యలు పరిష్కరించాలని డివైఎఫ్ఐ యువజన సంఘంగా డిమాండ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో నగర అధ్యక్షులు షేక్.షాకీర్, నగర ఉపాధ్యక్షులు విజయ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి : ఎంపీ

ప్రజాశక్తి - రామసముద్రం

ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధే మళ్లీ ఆయనను ముఖ్యమంత్రిగా ప్రజలు గెలిపిస్తారని రాజంపేట పార్లమెంట్ సభ్యులు వెంకట మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మినికి గోకుల్ కళ్యాణ మండపంలో వైసిపి కార్యకర్తల సమావేశంలో ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్ అహ్మద్ పాల్గొన్నారు. 19 పంచాయతీలకు నాయకులతో విడివిడిగా సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వం 600 అపద్దాలు చెప్పి గద్దెనెక్కి ప్రజలకు చేసిందేమి లేదని దుయ్యబట్టారు. నీరూ చెట్టు, జన్మభూమి కమిటీల ద్వారా టిడిపి నాయకులు వేలకోట్ల రూపాయలు కొల్లగొట్టిన సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. వచ్చే ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆరు గ్యారంటీలతో మరోసారి మూడు పార్టీలు ఒక్కటై ప్రజలను మోసం చేసేందుకు మూకుమ్మడిగా జత కలిశాయని అన్నారు. మన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మీద మాటల యుద్ధం జరుగుతుందని అన్నారు. జగనన్న చెప్పినట్లు నవరత్నాలతో పాటు మరెన్నో సంక్షేమ పథకాలు అందించారన్నారు. ప్రస్తుత పథకాలు కొనసాగాలంటే మన జగన్ మోహన్‌రెడ్డినే మరోసారి ముఖ్యమంత్రి చేసుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరూ వైసిపి సైనికులుగా పనిచేసి రామసముద్రం మండలం తరపున అత్యధిక మెజారిటీతో ఎంపిగా నన్ను, ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్ ను గెలిపించాలని ఆయన నాయకులకు కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో ఎంపిపి కుసుమ కుమారి, సింగిల్ విండో అధ్యక్షుడు కేశవరెడ్డి, వైస్ ఎంపిపిలు వెంకటరమణ రెడ్డి, గంగాధర్ నాయుడు, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు కొండూరు కృష్ణారెడ్డి, రాధాకృష్ణరెడ్డి, జయరాం రెడ్డి, మాజీ ఎంపీటీసీ దొడ్డిపల్లి ఆనంద్, బిసి నాయకులు గెవన్న , పాల్యం భాస్కర్, శివ, నారాయణస్వామి, మాల మహానాడు మండల అధ్యక్షులు అంబరీష్, మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపిటిసిలు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి



ప్రజల రద్దీతో కిటకిటలాడుతున్న దుకాణాలు

రాయచోటిలో రంజాన్ సందడి

- కిటకిటలాడుతున్న దుకాణాలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : పట్టణంలో రంజాన్ పండగ సందడి నెలకొంది. దాదాపు నెల రోజులు ముస్లిములు ఉపవాసం, నమాజు, జికర్, ఖురాన్ పఠనం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో గడుపుతారు. ఈద్ సమయం దగ్గరపడటంతో కొత్తబట్టలు, సరుకులు తెచ్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. దీంతో వస్త్ర, అలంకరణ వస్తువుల దుకాణాలు, కిరాణం సరుకుల అంగళ్లు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. గాంధీబజార్, కంసలవీధిలో వాహనాల రాకపోకలకు దారి లేని పరిస్థితి ఏర్పడింది. ఠనా నుండి గాంధీ బజార్, కంసల విధి, నాదనా వీధి, మార్కెట్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముస్లిములు ఉదయం పూట రోజా ఉపవాసం ఉంటారు. పగలు విపరీతమైన ఎండలు ఉండడంతో సాయంత్రం ఉపవాసం అనంతరం షాపింగ్ చేస్తున్నారు. అర్ధరాత్రి వరకు ఈ ప్రాంతంలో సేమియా, డ్రైఫ్రూట్స్, టోపీలు, చీరలు, మెహెందీ కోన్స్, గాజులు, డ్రస్సులు తదితర వస్తువుల కొనుగోలు సందడి కనిపించింది. ఈద్ కు పలావ్, బిర్యానీ తదితర వంటకాలు వండేందుకు అవసరమైన కూరగాయల కొనుగోళ్లతో పట్టణంలోని మార్కెట్, రైతుబజార్లు సైతం కిటకిట లాడాయి.

విద్యార్థినికి సన్మానం

ప్రజాశక్తి- పోరుమామిళ్ల : పట్టణంలోని శ్రీ వెంగమాంబ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థిని పి. భానుబీ జనవరి 2024లో నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి నవోదయ పాఠశాలలో ప్రవేశానికి అర్హత సాధించిందని పాఠశాల కరస్పాండెంట్ గుర్రం పుల్లపునాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అడ్మినిస్ట్రేటర్ నాగలింగేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపల్ గుర్రం దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థినికి శుభాకాంక్షలు తెలియజేశారు. తమ పాఠశాల విద్యార్థి సీటు సాధించడం ఆనందదాయకంగా ఉందన్నారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు



నిందితురాలి అరెస్టు చూపుతున్న ఎస్ఐ

ప్రజాశక్తి -నిమ్మనపల్లి

నాటు సారా విక్రయ స్థావరంపై సోమవారం నిమ్మనపల్లి పోలీసులు దాడులు నిర్వహించి, సారా విక్రయిస్తున్న ఓ మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సి.లోకేష్‌రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. సోమవారం నిమ్మనపల్లె పంచాయతీ నాగులయ్య గారి పల్లెకు చెందిన ఈశ్వరమ్మ నాగులయ్యగారిపల్లెకు సమీపంలోని అటవీ ప్రాంతంలో నాటుసారా విక్రయి స్తుండగా పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ తన సిబ్బంది, కొండయ్య గారిపల్లి గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శి (మహిళా పోలీస్) తో కలిసి దాడులు చేసి ఆమె వద్ద నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నాటు సారా విక్రయిస్తూ పట్టుబడ్డ నిందితురాలి పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. మండలంలో నాటుసార తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారి పై కఠిన చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఈ దాడుల్లో పోలీస్ కానిస్టేబుల్ రాజేష్, కొండయ్యగారిపల్లె మహిళా పోలీస్ సైదా సుల్తానా పాల్గొన్నారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి- రాయచోటి : జిల్లాలో ఎండ తీవ్రత, వడగాల్పుల బారినపడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండేలా సంబంధిత శాఖలు వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ సూచించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎండ తీవ్రత, వడగాల్పుల బారిన పడకుండా చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రజలు వడదబ్బకు గురి కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఇందుకు వివిధ శాఖలు క్షేత్రస్థాయిలో చలివేంద్రాల ద్వారా తాగు నీరు, ప్రాథమిక చికిత్స వంటి చర్యలను సత్వరం అమలు పర్చాలని అధికారులను ఆదేశించారు. వేసవి కాలంలో వడగాల్పులు, ఎండ తీవ్రత పరిరక్షణకు జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, పంచాయతీలలోని ముఖ్య కూడలి ప్రదేశాల్లో చలువ పందిళ్ళు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని మున్సిపాలిటీ, పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని జిల్లాలోని పశువులకు నీరు, పశుగ్రాసం కొరత లేకుండా చూడాలని, వేసవిలో పశువులకు వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు చేయకూడని పనులపై అవగాహన కల్పించాలని పశు సంవర్ధక శాఖ అధికారులకు సూచించారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండవచ్చున్న డిజాస్టర్ మేనేజ్మెంట్ సూచనల నేపథ్యంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. కార్మికులు, కూలీలు అధికంగా పనిచేస్తున్న ప్రదేశాలలో తగు జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో నీటి ఎద్దడి లేకుండా నీటి సరఫరా, పారిశుధ్యం ద్వారా తాగు నీటి వనరులను పరీక్షించి ఎవరికి ఇబ్బంది కలగకుండా తాగునీటి సరఫరాను పకడ్బందీగా చేపట్టాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ఆయా నీటి ప్రాజెక్టుల ద్వారా చేపట్టిన నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన విధంగా పర్యవేక్షించాలని పేర్కొ న్నారు. ఉపాధి కూలీలు పని చేసే ప్రాంతాల్లో నీడ కల్పించే ఏర్పాట్లు, తాగునీరు, ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ సత్యనారాయణ, డ్వామా, వైద్య ఆరోగ్యం, ఆర్డబ్ల్యూఎస్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, సమాచార శాఖ, వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధకం, పరిశ్రమలు, మైన్స్ తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అవకాశమిస్తే అభివృద్ధి చేస్తా : 'మండిపల్లి'

ప్రజాశక్తి- రాయచోటి

నియోజకవర్గంలోని ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని తనకు ఒక అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపించాలని మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో 18,19,20వ వార్డుల్లో తెలుగుదేశం పార్టీ, జనసేన, భారతీయ జనతా పార్టీ కుటమి ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.ఈ ఎన్నికల ప్రచారం చౌడేశ్వరి అమ్మవారి ఆలయం నుంచి ఆయన ప్రారంభించారు. వార్డులోని స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు ఒక అవకాశం ఇవ్వాలని రాయచోటి ప్రజల రుణాన్ని తీర్చుకోవడంతోపాటు రాయచోటి ప్రజా, సంక్షేమాభివృద్ధికి పాటు పడతానని చెప్పారు. రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి కిరణ్ కుమార్ రెడ్డికి ఆదరించి కమలం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రతి ఓటర్‌కు రెండు ఓట్లు వేసే అవకాశం ఉంటుందని ఒకటి ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి సైకిల్ గుర్తు , బిజెపి పార్లమెంట్ అభ్యర్థి కిరణ్ కుమార్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు .కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

10 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - గాలివీడు

మండలంలోని దాసరిపేటకు చెందిన మోదిన వెంకటరమణ వెంకటరమణ అనే వ్యక్తి వద్ద ఉన్న పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని, నిందితుడిని కూడా అరెస్టు చేశామని ఎస్ఐ వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరూ మద్యం కానీ, డబ్బులు కానీ దగ్గర ఉంచుకోరాదని పేర్కొన్నారు. నగదుకు తప్పని సరిగా పత్రాలుండాలని తెలిపారు.

ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించడం సురక్షితం

ప్రజాశక్తి - కడప : ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించడం పూర్తిగా సురక్షితమైన మార్గమని ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ అన్నారు. ఎటువంటి మానసిక ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సోమవారం విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించే విధానంపై స్వయంగా విద్యుత్ బిల్లుల సూళ్ల కేంద్రానికి వెళ్లి వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ బిల్లులను 365 రోజులు ఎప్పుడైనా ఎక్కడి నుంచి అయినా సెలవు రోజుల్లోనూ ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చని తెలియజేశారు. చెల్లించిన చెల్లింపు వివరాలు తక్షణమే ఆన్‌లైన్‌లోనే చూసుకోవచ్చని అన్నారు. విద్యుత్ బిల్లులు చెల్లింపులు డిజిటల్ రూపంలో ఆన్లైన్ ద్వారా సురక్షితంగా విద్యుత్ వసూల్ కేంద్రాల వద్దకు వెళ్లకుండా, క్యూలో నిలబడాల్సిన అవసరం లేకుండా, వ్యయప్రాసలకు గురికాకుండా, మీ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా, వివిధ రకాల ఆన్‌లైన్ యాపుల ద్వారా మీ మొబైల్ ఫోన్ నుంచి ఎక్కడి నుండైనా చెల్లించుకునే సౌలభ్యం ఉందని తెలియజేశారు. 80 శాతం మంది వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా విద్యుత్ బిల్లులను చెల్లించి తమ సంతృప్తి కరస్థాయిని తెలియజేశారని తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోని మీరు చెల్లించిన డబ్బులకు ఆన్లైన్ రశీదు పొందవచ్చని పేర్కొన్నారు. ఆన్లైన్ రశీదులపై ఏమైనా అపోహలు ఉంటే తమ దగ్గరలోని విద్యుత్ రెవెన్యూ ఆఫీసు అధికారులకు ఫోన్ ద్వారా కానీ లేదా స్వయంగా వెళ్లి మీ సందేహాలను నివృత్తి చేసుకోవాలని తెలియజేశారు.

వైసిపి పాలనలో బిసిలకు అన్యాయం : టిడిపి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి - రామసముద్రం

మండలంలోని పెద్దకురప్పల్లి పంచాయతీ తిరుమల రెడ్డిపల్లి గ్రామంలో సోమవారం టిడిపి మండల పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బిసి గర్జన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మదనపల్లి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఉమ్మడి అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ బిసిలంతా ఏకమై వైసిపిని ఓడించాలని పిలుపునిచ్చారు. వైసిపి పాలనలో బిసిలకు అన్యాయం జరిగిందని దుయ్యబట్టారు. వైసిపి నాలుగున్నర ఏళ్ల పాలనలో బిసిలు దగా పడ్డారన్నారు. వైసిపిలో బిసి నేతలకు ప్రజలకు గౌరవం లేదన్నారు. వైసిపి పాలనలో బిసిలు బానిసలుగా తలవంచే విధంగా పరిపాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. నాలుగున్నరేళ్ల పాలనలో సిఎం జగన్ మోహన్‌రెడ్డి బిసిలను అణచివేసే ప్రయత్నం చేశారే తప్ప బీసీ అభ్యున్నతికి పాటు పడలేదని మండిపడ్డారు. అనంతరం బిసి నాయకులు మాట్లాడుతూ బిసిలకు చెందిన దాదాపు 30 సంక్షేమ పథకాలను రద్దుచేశారని అన్నారు. బెస్ట్ అడైలబుల్ స్కూల్స్, స్టడీ సర్కిల్స్,స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలు, విదేశీ విద్య లాంటి పథకాలు రద్దు చేసి బిసిలను చదువులకు దూరం చేశారన్నారు. బిసి కార్పోరేషన్లకు నిధులివ్వకుండా నిర్వీర్యం చేశారని అన్నారు. రిజర్వేషన్లు పదవులు బిసిలకు ఇవ్వకుండా మోసం వేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని బిసిలంతా ఉమ్మడిగా పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా నష్టపోయింది బిసిలు మాత్రమేనని అన్నారు. బిసిల అభ్యున్నతి కోసం సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అభివ ృద్ధి చెందేందుకు టిడిపి ప్రోత్సహించిందన్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం బిసిల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యమిచ్చిందన్నారు. జగన్ రెడ్డి పాలనలో బీసీలపై దాడులు, దౌర్జన్యాలు తీవ్రమయ్యాయని ధ్వజమెత్తారు. అక్రమ కేసులు పెట్టి బిసిలను దగా చేసే జగన్‌రెడ్డిని ఓడించేందుకు బిసిలంతా ఏకమై ముందుకు నడవాలని పిలుపు నిచ్చారు. టిడిపి ప్రభుత్వ హయాంలో బిసి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి స్వయం ఉపాధికి భారీగా దోహదం చేస్తే ,నేడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి మొక్కుబడిగా 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేసి నామమాత్రం నిధులు కూడా ఇవ్వకుండా వాటిని నిర్వీర్యం చేసి ఈ కార్పొరేషన్ పదవులు కేవలం చెప్పుకోవడానికి మాత్రమే మిగిలాయన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మదనపల్లి నుండి రామసముద్రం వరకు డబుల్ రోడ్డు విస్తరణ చేసి తీరుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండలం మాజీ జడ్‌టిసి శివశంకర్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు కృష్ణంరాజు యాదవ్, శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ వెంకటరమణ రెడ్డి, శ్రీనివాసులు, రెడ్డి శేఖర్, పెంచుపాడు స్వామి, జనసేన మండల నాయకులు చంద్రశేఖర్, సనా ఉల్లా, విశ్వనాథ్, క్రాంతి, తదితర బిసీ నాయకులు పాల్గొన్నారు.

152 మంది వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లె, ములకల చెరువు మండలాల్లో 152 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు. తంబళ్లపల్లె మండలంలో సోమవారం 62 మంది గ్రామ వాలంటీర్లు స్వఛ్ఛందంగా రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపిడిఒ కృష్ణమూర్తికి అందజేశారు. ఎద్దులవారిపల్లి గ్రామ సచివాలయ పరిధిలో 10 మంది, కోటకొండ 11 మంది, కుక్క రాజు పల్లి 7 మంది, తంబళ్లపల్లి-2లో 3 మంది, రేణుమాకులపల్లి 11, గోపి దిన్నే 8 మంది, గుండ్లపల్లి 4 మంది, తంబళ్లపల్లి-1లో 1, కన్యమడుగులో 7 మంది, రాజీనామాలు చేశారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పడినప్పుడు నుండి ఇంటింటికి వెళ్లి అర్హులైన ప్రతి పేదవారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించామన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా కులమతాలకతీతంగా ఎక్కడ రాజకీయం అనే మాట చేయకుండా పేదలకు తమ వంతు సేవలు అందించామన్నారు. టిడిపి ప్రతిపక్ష నాయకుడు ఆ పార్టీ నాయ కులు గ్రామ వాలంటీర్లను పెన్షన్ల పంపిణీలో తప్పించడం బాధాకరమన్నారు. గ్రామీణ వృద్ధులు, పెన్షన్ అందు కోలేక సుమారు 37 మంది మ ృత్యువాత పడడం తమకు బాధ కలిగించిందని ఇందుకు తమ బాధ్యతగా రాజీనామా సమర్పిస్తున్నట్లు తెలిపారు. తిరిగి వైసిపి విజయానికి స్థానిక ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిల విజయానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. **ములకలచెరువు :** మండలంలో 146 మంది వాలంటీర్లు రాజీనామా చేసినట్లు మొలకల చెరువు ఎంపిడిఒ పోలప్ప సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ములకలచెరువు మండలంలో 216 మంది వాలంటీర్లు ఉండగా అందులో 146 మంది వాలంటీర్లు రాజీనామా చేసినట్లు తెలిపారు. ఇతర కారణాలు రిత్యా వాలంటరీ రాజీనామా చేసినట్లు రాజీనామా పత్రంలో



తంబళ్లపల్లె : ఎంపిడిఒ రాజీనామా పత్రాలు ఇస్తున్న వాలంటీర్లు

పేర్కొన్నారు. వాలంటరీ వద్ద ఉన్న మొబైల్, సిమ్ కార్డ్, డివైస్, ఇతర రికార్డులు ఆయా సచివాలయంలో అప్పగించినట్లు తెలిపారు. **రామసముద్రం:** మండలంలోని మూగవాడి, కెసిపల్లి పంచాయతీలలో మూకుమ్మడిగా వాలంటీర్ల రాజీనామా చేశారు. ఎన్నికల విధుల్లో వాలంటీర్ల తలదూర్చావద్దని ఈసీ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో పలువులు రాజీనామా చేసి వైసిపి అభ్యర్థులకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి రమణారెడ్డి, ఎంపిటిసి శైలజ రాధరెడ్డి మాట్లాడుతూ రాజీనామా చేసిన వాలంటీర్లును ప్రభుత్వం రాగానే తిరిగి నియామకాలు జరప నున్నట్లు తెలిపారు. గత వారంలో జగన్మోహన్‌రెడ్డి రాబోయే ఎన్నికల అనంతరం వాలంటీర్ల నియామకంపైనే తొలి సంతకం చేస్తానని హామీ ఇచ్చారని అన్నారు. తమ ప్రభుత్వంలో వాలంటీర్లు అందరూ బాగా పనిచేశారు కాబట్టే వాలంటీర్లు అంటే చంద్రబాబుకి, టిడిపి నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయని చెప్పారు. కార్యక్ర మంలో వైస్ ఎంపిపి రమణా రెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు కేశవ్ రెడ్డి, సర్పంచులు శ్రీనివాసులు రెడ్డి, సర్పంచ్ రత్నమ్మ, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 'సాయి' విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - రాయచోటి : పట్టణంలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఉద్యోగ నియామకాల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచారుని శ్రీ సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లా కొప్పర్తి పారిశ్రామిక వాడకు చెందిన ఎఐఎల్ డిక్సన్ టెక్నాలజీస్ సంస్థ నిర్వహించిన వివిధ దశల ఎంపిక ప్రక్రియలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన 20 మంది విద్యార్థులు వివిధ దశలలో నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో ప్రతిభ కనబరిచి లైన్ లీడర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని వివరించారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ అధికారి కొత్తపల్లి ఇంతియాజ్ పాలిటెక్నిక్ కళాశాల ఇంచార్జ్ వి.ప్రతాప్‌రావు వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.



గుర్రప్ప, జాన్సన్‌లను సన్మానిస్తున్న న్యాయవాదులు

బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గుర్రప్ప, జాన్సన్

ప్రజాశక్తి - కడప

కడప బార్ అసోసియేషన్ (న్యాయవాదుల సంఘం)కు సోమవారం నిర్వహించిన ఎన్నికల్లో సీనియర్ న్యాయవాది 16 ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించారు. 639 ఓట్లకు గాను 571 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్ష పదవికి పోటీ చేసిన బొగ్గుల గుర్రప్ప నాయుడుకు 292 ఓట్లు పోలయ్యాయి. జి.వి. రాఘవరెడ్డికి 276 ఓట్లు వచ్చాయి. ప్రధాన కార్యదర్శిగా పోటీచేసిన వై.టి. జాన్సన్ కెనడి 50 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఆయనకు 310 ఓట్లు పోలయ్యాయి. వి. చంద్రవదనకు 260 ఓట్లు వచ్చాయి. స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా పోటీ చేసిన ఎన్. చిన్నయ్య 70 ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించారు. స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా పోటీ చేసిన ఎన్. చిన్నయ్యకు 319 ఓట్లు పోలయ్యాయి. జె విజయ్ కుమార్‌కు 249 ఓట్లు వచ్చాయి. కడప బార్ అసోసియేషన్ (న్యాయవాదుల సంఘం) ఎన్నికల్లో అధ్యక్షులుగా విజయం సాధించిన బొగ్గుల గుర్రప్ప నాయుడుకు, ప్రధాన కార్యదర్శిగా విజయం సాధించిన వై.టి. జాన్సన్ కెనడీకి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా విజయం సాధించిన ఎన్. చిన్నయ్య కు చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ పెద్దిరెడ్డి జయరామిరెడ్డి చేతుల మీదుగా గెలుపొందిన పత్రాలను అందజేశారు. ముగ్గురికి సీనియర్, జూనియర్ న్యాయవాదులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పూలమాలలతో ఘనంగా సత్కరించి, స్వీట్లు పంచిపెట్టి అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా కడప బార్ అసోసియేషన్ (న్యాయవాదుల సంఘం) ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా పి.చంద్ర మోహన్, కోశాధికారిగా ఎం.వి.సుబ్బరామయ్య, లైబ్రరీ సెక్రటరీగా పి.నాగభూషణం, సెక్రటరీ-1 గా ఏ.రవీంద్రారెడ్డిలు పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ పెద్దిరెడ్డి జయరామిరెడ్డి తెలిపారు. వీరికి కూడా గెలుపొందిన పత్రాలను చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ అందజేశారు. ఏకగ్రీవంగా ఎన్నికైన వారికి సీనియర్, జూనియర్ న్యాయవాదులు అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు.

'నారాయణ'లో ముందస్తు ఉగాది వేడుకలు

ప్రజాశక్తి - రాయచోటి : పట్టణంలోని బోస్ నగర్‌లో ఉన్న నారాయణ పాఠశాలలో సోమవారం ముందస్తు ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఎ జిఎం శంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉగాది పండుగ విశిష్టతను వివరించారు. ప్రతి పండుగను ముందస్తుగా జరుపుకోవడం, ఆ పండుగ విశిష్టతలను విద్యార్థులకు తెలియజెప్పడం చాలా సంతోషంగా ఉందన్నారు. 'అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ ఖాదర్‌వలీ మాట్లాడుతూ నారాయణ పాఠశాలలోని విద్యార్థులను కుల, మతాలకు అతీతంగా అందరూ సమానమే అన్నారు. అందుకోసమే అన్ని మతాల పండుగలను ముందస్తుగా నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పస్తామన్నారు. తద్వారా వారు భవిష్యత్తులో ఉత్తమ పేరులుగా మారతారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్ నందిని, సుగుణవేణి, యువరాజ్, ఎఒ నరసింహాలు పాల్గొన్నారు.


ఎంపిడిఒకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వాలంటీర్లు

29 మంది వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు మండలం గంజికుంట గ్రామ పంచాయితీ పరిధిలో సోమవారం 20 మంది గ్రామ, వార్డు సచివాలయ వాలంటీర్లు మూకుమ్మడి రాజీనామా చేశారు. ఆ మేరకు ఎంపిడిఒకు రాజీనామా పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గెలుపు కోసం తాము స్వచ్ఛందంగా ప్రచారం నిర్వహిస్తామన్నారు. ప్రచారానికి అడ్డుగా ఉన్న వాలంటీర్ పోస్టును స్వచ్ఛందంగా వదులు కుంటున్నామన్నారు. మునిసిపల్ పరిధిలోని ఆరో వార్డుకు చెందిన 9 మంది వాలంటీర్లు కూడా తమ రాజీనామా పత్రాలను మునిసిపల్ కమిషనర్ జబ్బర్ మియాకు అందజేశారు.

ఘనంగా పండుగల సంబరాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వైఎస్ఆర్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో ఉగాది, రంజాన్, శ్రీరామనవమి పండుగ పర్వదినాలు పురస్కరించుకొని పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉగాది పండుగ సందర్భంగా సాయంత్రం 6 గంటల నుంచి శ్రీరాజా కళానిలయం, పులివెందుల వారి చిన్నారులచే డ్యాన్స్ మాస్టర్ రాజా ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, ఈనెల 11న రంజాన్ పండుగ సందర్భంగా పులివెందుల మహేష్ యస్.కె.ఫిల్మ్ స్టూడియో శ్రీ డ్యాన్స్ మాస్టర్ శర్వన్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, ఈనెల 17న శ్రీరామనవమిని పురస్కరించుకొని స్థానిక విజయవాడ ఎక్సలెంట్ ఇన్స్టిట్యూట్ వారి నాగార్జున స్కూల్, పులివెందుల వారి చిన్నారులచే డ్యాన్స్ మాస్టర్ చిట్టి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. పులివెందుల పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు గండి క్షేత్రంలో ఉగాది ఉత్సవాలు

ప్రజాశక్తి - చక్రాయపేట


ఆంజనేయ స్వామి మూలవిరాట్

క్రోధి నామ సంవత్సరం ఉగాది పండుగ ఉత్స వాలు గండి క్షేత్రంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అసి స్టెంట్ కమిషనర్ అలవల పాటి ముకుం దరెడ్డి తెలిపారు. మంగళ వారం వేకువజామునే స్వామివారి ఉత్సవ విగ్రహానికి పంచామృ తాభిషేకం, అనం తరం భక్తాదు లకు స్వామివారి దర్శనం కల్పి స్తారు. ఉదయం ఉచిత ప్రసాదం, మధ్యాహ్నం పండుగ భోజనం వడ్డించ నున్నారు. వేద పండి తులచే పం చాంగ శ్రవణం, ఆలయ అర్చకులకు సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం (మెరవణి) నిర్వహించనున్నట్లు ఎసి వివరించారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు కవి సమ్మేళనం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరులో నూతనంగా ఏర్పాటైన 'రామరాజభూషణ సాహితీపీఠం' ఆధ్వర్యంలో మంగళవారం కవిసమ్మేళనం ఏర్పాటు చేసినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు పవన్ కిషోర్‌రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రోధి నామసంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొనిస్థానిక అనిబిసెంట్ మున్సిపల్ గ్రంథాలయంలో ఉదయం గం.9.30ని.లకు ప్రారంభమవుతుందన్నారు. కవి సమ్మేళ నంలో ప్రముఖ కవులు డి.కె.చదువులబాబు, కాశీవరపు వెంకటసుబ్బయ్య, కొత్తపల్లి శీను, పల్లా రామారావు, కామనూరు రామ్మోహన్, పుత్తూరు సుబ్రహ్మణ్యం, కోట దుర్గా భవానితోపాటు 20మంది కవులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి : ఎంపీ

- టిడిపి నుంచి వైసిపిలో చేరిన కొమెర హరినాథ్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్


వైసిపిలో చేరినవారితో ఎంపీ అవినాష్‌రెడ్డి, వైఎస్ మధు, వైఎస్ మనోహర్ రెడ్డి

జగనన్నతోనే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందిందని కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. పులివెందుల పట్టణం చందమామ డాబా వెనక భాగాన నివాసముంటున్న కొమెర హరినాథ్ సోమవారం టిడిపి నుంచి వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా సాయంత్రం ఎంపీ అవినాష్‌రెడ్డి హరినాథ్ స్వగృహానికెళ్లి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అలాగే హరినాథ్‌కు సంబంధించిన దాదాపు 50 కుటుంబాలు వైసిపిలో చేరాయి. కోమెర వెంకట కులాయప్ప, సంపంగి శంకర్, కొమర హరీష్, తమ్మిశెట్టి సాంబశివ, శశికిరణ్, సాయి కుమార్, వై ప్రసాద్, పి ప్రసాద్, ధరణి, ఈశ్వర్, హబీబుల్లా, షేక్ అలీ, మౌలా, షేక్ మస్తాన్, వై రామచంద్రారెడ్డి, పెద్దన్న, చంద్రశేఖర్, మనోహర్, షేక్షావలి, బాషా, రాజేష్ గౌడ్, రామాంజనేయ రెడ్డి, మల్లేష్ బాబు, షేక్ ముబారక్, సర్దార్, బాషా, మహేంద్ర, మంజుల, శశిధర్, కెమె మారుతి, బత్తల యశ్వంత్, నాగేంద్ర, వల్లపు వంశీ, పరమేష్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ముందుగా ఎంపీని గజమాలతో సత్కరించారు, కార్యక్రమంలో పురపాలక ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్‌రెడ్డి, తొండూరు మండల ఇన్‌ఛార్జి వైయస్ మదన్ మోహన్ రెడ్డి, రోషన్ రెడ్డి, వేల్పుల రామలింగారెడ్డి, పురపాలక చైర్మన్ వర ప్రసాద్, బయపురెడ్డి, కౌన్సిలర్ జెసిఎస్ ఇన్‌ఛార్జి కిషోర్, చంద్రమౌళి పాల్గొన్నారు.

పొన్నపురెడ్డి శివారెడ్డి కుటుంబంతోనే నా ప్రయాణం

- సీనియర్ న్యాయవాది మురళీధర్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్


మురళీధర్‌రెడ్డి ఇంట్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, నాయకులు

పొన్నపురెడ్డి శివారెడ్డి కుటుంబంతోనే తన రాజకీయ ప్రయాణం ఉంటుందని ప్రముఖ సీనియర్ న్యాయవాది, బార్ అసోసియేషన్ కార్యదర్శి మురళీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం కన్నెలూరు గ్రామంలో మురళీధర్‌రెడ్డి ఇంట్లో సోమ వారం ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా న్యాయవాది మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తాను, తన అనుచరులు వైసిపి కోసం, మూలె సుధీర్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తామన్నారు. తాను మొదటి నుంచి పొన్నపురెడ్డి శివారెడ్డి వెంటనే ఉన్నానని తెలిపారు. ఆయన తర్వాత రామ సుబ్బారెడ్డి వెంట నడుస్తున్నానని తెలిపారు. రామ సుబ్బారెడ్డి ఎక్కడ ఉంటే ఆ పార్టీ గెలుపునకు కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ వైసిపి మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, వైసిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమబోయిన గురుమూర్తి యాదవ్, హృషికేశవ రెడ్డి, పోరెడ్డి మహేశ్వరరెడ్డి, మల్కిరెడ్డి హనుమంతరెడ్డి, బడిగింజల చంద్రమౌళి, హార్టికల్చర్ చైర్మన్ సంబటూరు ప్రసాద్ రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్యారంటీలు విజయానికి సోపానాలు

- పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 9 గ్యారంటీ పథకాలు విజయానికి సోపానాలని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 5 గ్యారంటీ పథకాలతో కర్ణాటక, 6 పథకాలతో తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఎపిలో కూడా 9 గ్యారంటీ పథకాలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని తులసిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మహాలక్ష్మి పథకం కింద ప్రతి పేద కుటుంబానికి ఒక మహిళకు నెలకు రూ.8,333 ప్రకారం ఎడాదికి రూ.లక్ష ఆర్థికసాయం చేయనున్నట్లు తెలిపారు. రూ.2లక్షల వరకు వ్యవసాయ రుణమాఫీ చేస్తారన్నారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించనున్నట్లు వివరించారు.

ప్రత్యేకహోదా పదేళ్లు అమలవుతుందన్నారు. ఇళ్లు లేని వారందరికి రూ.5 లక్షలతో ఇంటి నిర్మాణం చేపడుతామన్నారు. కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్యను అందివ్వనున్నట్లు తెలిపారు. వృద్ధులు, వితంతువులకు నెలకు రూ.4 వేలు పింఛన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద రోజుకు 400 కూలి ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఖాళీగా ఉన్న 2.25 లక్షల పోస్టులను భర్తీ చేస్తామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని తులసిరెడ్డి కోరారు.

గ్రామాల్లో సమస్యలపై దృష్టి సారించండి


మాట్లాడుతున్న ఎంపిడిఒ సల్మాన్ రాజ్

ప్రజాశక్తి - సింహాద్రిపురం

గ్రామాల్లో సమస్యలపై ఆయా శాఖల అధికారులు దృష్టి సారించాలని ఎంపిడిఒ సల్మాన్ రాజు తెలిపారు. మండల కేంద్రమైన సింహాద్రిపురం ఎంపిడిఒ కార్యాలయంలో సోమ వారం మండల స్థాయి అధికారులతో విలేజ్ డెవలప్మెంట్ ఇండెక్స్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి దృష్ట్యా గ్రామాలలో తాగునీటికి ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు సూచించారు.

మౌలిక వసతులపై చర్చించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి పద్మనాభరెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి శివ మోహన్‌రెడ్డి, వైద్యాధికారులు కుమార్, షేక్ హుస్సేన్ పీరా, పంచాయతీ రాజ్ ఎఇ ఉదయ్ కుమార్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ప్రసాద్, ఉపాధి హామీ పథకం ఎపిఒ జయ భారతి, పంచాయతీ సెక్రటరీలు, అధికారులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాది

సమస్యాత్మక బూత్‌ల్లో అదనపు బలగాలు కావాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు నియోజకవర్గంలో గడిచిన కొన్ని సంవత్సరాల నుండి కొన్ని సమస్యాత్మక పోలింగ్ బూత్‌లలో అదనపు బలగాలను నియమించాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్‌రెడ్డి తరపున సీనియర్ న్యాయవాది చాగంటి రఘురామిరెడ్డి ఆంధ్ర ప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారిని కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాది మాట్లాడుతూ 83, 84, 85, 86, 87, 88, 89, 90, 149, 150, 151, 152బూత్‌లలోని ప్రజలను, ఓటర్లను బెదిరించి పోలింగ్ బూత్‌లలో కక్ష సాధింపు, రాజకీయ ప్రభావం, రిగ్గింగ్ కారణంగా చాలా సంవత్సరాలుగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం లేదన్నారు. ఆయా పోలింగ్ బూత్‌లకు సంబంధించి గత ఎన్నికలలో ఇద్దరు ఐపిఎస్‌లు, స్థానిక పోలీసుల మీద కూడా దాడులు చేయడం జరిగిందన్నారు. ఆయా బూత్‌లను గుర్తించి అదనపు సాయుధ బలగాలు, కేంద్ర బలగాలు, సిసి టీవీలను అందించి శాంతియుత వాతావరణం కల్పించాలని కోరారు. ఓటర్లు ప్రజాస్వామ్యం ప్రకారం వారి ఓటును వినియోగించుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరుతున్నామని తెలిపారు.

ఎండలకు తాళలేక చెట్లను ఆశ్రయిస్తున్న జీవాలు

ప్రజాశక్తి - చాపాడు

ఎండ తీవ్రత రోజురోజుకూ అధికమవుతోంది. దీంతో పశువులు, గొర్రెలు, మేకలు అల్లాడి పోతున్నాయి. ఉదయం ఏడు గంటల నుంచే భానుడి దెబ్బకు ఉక్కపోత ఎక్కువగా ఉంటోంది. పశువులను మేత కోసం వదిలిన కొంతసేపటికే అవి నీడపాటును చూసుకుంటున్నాయి. పంటపొలాలు, వాగులు, వంకలు వద్ద ఉన్న చెట్ల వద్దకు తరలి పోతున్నాయి. ఎండ తీవ్రత రోజురోజుకీ తీవ్ర రూపం దాల్చుతోంది. తీవ్ర వర్షాభావంతో నీటి వనరులు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. ఈ ఏడాది తీవ్ర వర్షాభావం ఏర్పడడంతో చెరువులు, వంకలు, వాగులు అన్ని ఎండి పోయాయి. మేతకు వెళ్లిన జీవాలకు ఎటు చూసినా నీరు కనిపించడంలేదని వాటి పెంపకందారులు ఆందోళన చెందుతున్నారు. జీవాల పెంపకం చాలా కష్టంగా ఉందని వాపోతున్నారు. ఉన్న జీవనాధారం కూడా వేసవికాలంలో దూరమవుతోందని ఆవేదన చెందుతున్నారు. కుందూ నది, దాని అనుసంధాన వంకల్లో మాత్రమే నీరు అందుబాటులో ఉందని పశువుల కాపరులు పేర్కొంటున్నారు. సీతారాం పురం వద్ద గొర్రెలు మేకలు సేదదీరుతూ కనిపించాయి. నదిలో ఉన్న గుంతల్లో నీటిని తాగి సేద దీరుతున్నాయి.


చెట్టు నీడకు చేరిన గొర్రెలు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న అంజాద్‌బాషా

రంజాన్ ముస్లింలకు ఎంతో పవిత్రమైంది

- ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

ప్రజాశక్తి - కడప

కడప నగరం 28వ డివిజన్లోని కార్పొరేటర్ ఆరిపుల్ల ఆధ్వర్యంలో సోమవారం బండ్ల మిట్ట మసీదులో ఇఫ్తార్ విందు నిర్వహించారు. పవిత్ర రంజాన్ మాసంలో జరిగే ఇఫ్తార్ విందులు ప్రజల మధ్య సోదర భావం, ఆత్మీయ సహృద్భావాలను పరిమళింపజేస్తాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి, యస్.బి అంజాద్ బాషా పేర్కొన్నారు. పవిత్రమైన రంజాన్ మాసంలో విశ్వశాంతికి ఆ అల్లాహ్‌ను ప్రార్థించడం జరుగుతుందన్నారు. పవిత్రమైన రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం ఏర్పాటు చేయడం ఎంతో పుణ్య కార్యం, అభినందనీయం అన్నారు. కులమతాలకు అతీతంగా కడప నగరం మత సామరస్యానికి ప్రతీక అని అన్నారు. పవిత్ర దైవారాధనకు, ధార్మిక చింతనకు, దైవభక్తికి క్రమశిక్షణకు, దాతృత్వానికి రంజాన్ మాసం అలవాలమన్నారు. మనిషి సత్ప్రవర్తనలో నడవడానికి.. రంజాన్ ఉపవాసాలు ఉపకరిస్తాయన్నారు. సర్వమతాల సారం ఒక్కటేనని, ఉపవాస దీక్షలు ఆరాధన ప్రార్థనలు మనుషుల్లో ప్రేమ, సోదరభావం, మానవత్వం వంటి సద్గుణాలను పెంపొందించడమే రంజాన్ ఉపవాసాల ముఖ్య ఉద్దేశమన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరూ దైవం అనుసరించిన మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు పీకే అఫ్జల్ ఖాన్, మాజీ డిప్యూటీ మేయర్ నబి రసూల్, నగర అధ్యక్షుడు నారపురెడ్డి సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ బంగారు నాగయ్య యాదవ్, కువైట్ కన్వీనర్ బిహెచ్ ఇలియాస్, పెద్దిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, రమేష్ రెడ్డి, ఇమ్రాన్, కమల బాషా, జహీర్, అజ్మతుల్లా, పవర్ అల్తాఫ్ గౌస్‌లా, మత గురువులు, ముస్లిం ప్రముఖులు, వైసీపీ నాయకులు, పసుపులేటి మనోజ్ కుమార్, జిల్లా వర్క్స్ బోర్డ్ వైస్ చైర్మన్ రిజ్వాన్, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

మద్దెలచెరువు పాలెంలో క్షేత్ర దినోత్సవం

ప్రజాశక్తి - పీలేరు

పీలేరు మండలం, ముడుపులు వేముల గ్రామం, మద్దెల చెరువుపాలెంలో వేరుశనగ పంటలో మేలైన యాజమాన్య పద్ధతులపై క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ క్షేత్ర దినోత్సవానికి జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రనాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంటలో పొలంబడి 14 వారాలు నిర్వహించి, రైతు తానంతట తానే స్వయం నిర్ణయం తీసుకునేలా తయారు కావాలన్నారు. గ్యాప్ (జిఎపి) సర్టిఫికేషన్ ద్వారా తమ ఉత్పత్తి అధిక ధరలకు అమ్ముకోవడమే దీని ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమానికి డి.ఆర్.సి ఏఓ సుచిత్ర, పీలేరు డివిజన్ ఏడిఏ వైవి రమణ రావు, ఎక్స్టర్నల్ ఇన్‌స్పెక్టర్ రవి, పీలేరు మండల వ్యవసాయ అధికారిని ఒ.రమాదేవి, టిఎ కరుణాకర్‌రెడ్డి, ఏఈవోలు నజీర్, ఇంద్ర, సేంద్రియ వ్యవసాయ సిబ్బంది, ఎఫ్.పి.ఓ సిఇఒ రవి, ఆర్.బి.కె సిబ్బంది, ఆర్ఏడబ్ల్యుఈపి మహానంది విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ చక్రబంధంలో వేంపల్లె



వైఎస్ఆర్ సర్కిల్‌లో అస్తవ్యస్తంగా ఉన్న ట్రాఫిక్

ప్రజాశక్తి - వేంపల్లె

ఓవైపు పండుగ మరో వైపు పనులతో వేంపల్లె ట్రాఫిక్ చక్ర బంధంలో చిక్కుకుంది. సోమవారం సాయంత్రం స్థానిక వైఎస్ఆర్ సర్కిల్‌లో రాయచోటి-కడప-పులివెందుల రోడ్డులో ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనాలు నిలిచిపోయాయి. ఉగాది, రంజాన్ పండుగలు రావడంతో వైఎస్ఆర్ సర్కిల్ జనాలతో కిటకిటలాడింది. వైఎస్ఆర్ సర్కిల్‌లో దుస్తుల షాపులు ఎక్కువగా ఉండడంతో వాటిని కొనుగోలు చేసేందుకు జనాలు అధిక సంఖ్యలో విచ్చేవారు. తమ వాహనాలు ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ అస్తవ్యస్తమైంది. పలువురు వాహనదారులు చాల ఇబ్బందులు పడ్డారు. రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండడంతో పూలు, మామిడి ఆకులు, కూరగాయలకు చెందిన తోపుడు బండ్లు రోడ్డుపైనే పెట్టి వ్యాపారం చేయడంతో అర కిలో మీటర్ వరకు వాహనాలు దాదాపు అరగంట పాటు నిలిచి పోయాయి. వాహనాల్లో, బస్సుల్లో వెళ్లే ప్రయాణికులు వాహనాలు నిలిచి పోవడంతో వేడికి చాలా అవస్థలు పడ్డారు. వైఎస్ఆర్ సర్కిల్‌లో ట్రాఫిక్ నిలిచిపోయిన విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి అడ్డంగా పెట్టిన వాహనాలను తొలగించారు. పండుగ పూట జనాలతో రద్దీగా ఉండే వైఎస్ఆర్ సర్కిల్‌లో పోలీసులు ఉండి ట్రాఫిక్ లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

ప్రధాన రహదారి జనాలతో రద్దీ

భారీగా పెరిగిన పూజా సామగ్రి ధరలు

పులివెందుల టౌన్ : తెలుగు వారి సంస్కృతికి ప్రతీక ఉగాది. సకలశుభాలకు తొలి మెట్టుగా భావిస్తారు. ఈ పర్వదినానే అన్ని కార్యక్రమాలను ప్రారంభిస్తారు. మంగళవారం ఉగాది పర్వదినం సందర్భంగా అవసరమైన పూజా సామగ్రిని ప్రజలు కొనుగోలు చేశారు. దీంతో సోమవారం ప్రధాన రహదారి పూలంగళ్ల సర్కిల్ జనాలతో కిటకిటలాడింది. పట్టణంలోని అన్ని బజార్లు రద్దీగా కనిపించాయి. అడుగుతీసి అడుగు వేయలేని స్థితి. ఎన్నడూ లేనంతగా పూజా సామగ్రి, పండ్లు, కొబ్బరికాయలు, పువ్వుల ధరలు అమాంతం పెరిగాయి. కొబ్బరికాయ ధర రూ.30 నుంచి రూ.35, మూర పూలు ధర రూ.80 నుంచి రూ.90 వరకూ పలికాయి. చెండు మల్లెపూలు కిలో రూ.150 పలుకగా, చిన్నపాటి మామిడి కాయ సైతం రూ.20 వరకూ విక్రయించారు. ధరలు పెరిగినా తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలు చేశారు. కూరగాయల ధరలు కూడా బాగా పెరిగాయి. వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడుతూ కనిపించాయి.



ప్రధాన రహదారిలో ఏర్పడిన జనాల రద్దీ



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి

సమిష్టిగా పనిచేస్తే గెలుపు మనదే

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కార్యకర్తలు, నాయకులు గ్రామాల్లో, పట్టణాల్లో సమిష్టిగా పనిచేస్తే గెలుపు మనదేనని తెలుగుదేశం పార్టీ కడప పార్లమెంటు అభ్యర్థి చదిపిరాల భూపేష్ సుబ్బరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఆయన ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముందుగా నియోజకవర్గంలో టిడివి, జనసేన, బిజెపి నాయకులను కలుపుకొని ఓటింగ్ ప్రచారం ఎలా చేయాలో దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. వాలంటీర్లను కావాలనే వైసిపి నేతలు, ఎమ్మెల్యేలు రాజీనామాలు చేయించి టిడిపి, కూటమి ప్రతిపక్షాలపై బురదజల్లే కార్యక్రమాన్ని చేస్తున్నారని, వీటిని ప్రజలకు వివరించాలన్నారు. ఓటర్లను మేలుకొల్పకపోతే రాష్ట్ర భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి ఆది నారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థిగా తాను గెలవడం జిల్లాలో చాలా ముఖ్యమైన విషయమన్నారు. ప్రతి కార్యకర్త గుర్తించి కూటమి గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి అన్నెబోయిన కొండయ్య, నవాబుపేట సుధాకర్‌రెడ్డి, బిర్రు సంతోష్ పాల్గొన్నారు.

ముద్దనూరు : సైకో జగన్‌ను గద్దె దించి, టిడిపి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కడప పార్లమెంట్ అభ్యర్థి భూపేష్‌రెడ్డి అన్నారు. జమ్మలమడుగు రహదారిలోని ఉమ్మడిశెట్టి కళ్యాణ మండపంలో సోమవారం ఎన్‌డిఎ కూటమి బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డితో కలిసి భూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి, బిజెపి, జనసేన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా, నియోజకవర్గ అభివృద్ధి, నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం కడపకు స్టీల్ ప్లాంట్ రావాలన్నారు. స్టీల్ ప్లాంట్ సాధనకు కృషి చేస్తానన్నారు. యువత బాగుంటే రాష్ట్రం బాగుంటుందన్నారు. రాష్ట్రాభివృద్ధి చెందాలంటే టిడిపి అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యువకునిగా కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన తనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని భూపేష్‌రెడ్డి కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఆది నారాయణరెడ్డి మాట్లాడుతూ ముంపు గ్రామాల ప్రజలకు వైసిపి ప్రభుత్వం రూ.10లక్షలు నష్ట పరిహారం చెల్లింపులో ఇబ్బందులు పడుతోందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు శివరామి రెడ్డి, బిజెపి నాయకులు సురేంద్రనాథ్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒక్క అవకాశమిస్తే అభివృద్ధి చేస్తా

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రస్తుతం జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని మైదుకూరు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ కోరారు. మండలం పరిధిలోని భూమాయపల్లె పంచాయతీలో సోమవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి జరగాలంటే చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మల్హోత్రా, మండలం టిడిపి అధ్యక్షులు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, సర్పంచ్ కొంగాని వెంకట సుబ్బయ్య యాదవ్, మాజీ జడ్పీటీసీ సభ్యులు గోవింద్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ సందుల నాగశివారెడ్డి, ఇట్టేం శ్రీరాములు యాదవ్, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, అంకాళ యాదవ్, రాముడు, కట్టుబడి రమణ, తుట్టే రాము యాదవ్, ఓబుల్, గోవింద్ సుబ్బయ్య, జండాల బాషా, పుల్లయ్య నాయిడు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న పుట్టా సుధాకర్ యాదవ్

పెండింగ్ జీతాలను చెల్లించాలి : సిఐటియు



డాక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రభుత్వ హాస్పిటల్‌లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్స్‌కు పెండింగ్‌లోని జీతాలు చెల్లించాలని సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్ కోరారు. సోమవారం పట్టణ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రఫిక్‌పాషాకు సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్, నాయకుడు వినయ్ కుమార్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్పత్రిని శుభ్రంగా ఉంచే సిబ్బందికి జీతాలు వేయకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ హాస్పిటల్స్ పరిశుభ్రంగా ఉంచేందుకు క్రియాశీలకంగా ఉన్న సిబ్బందికి 5 నెలలు అవుతున్నా ఇంతవరకు సరిగ్గా జీతాలు వేయలేదని తెలిపారు. కుటుంబాలు పోషణ గడవడానికి చాలా కష్టంగా ఉందని తమకు వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు, కాంట్రాక్టర్ స్పందించి వెంటనే పెం డింగ్ వేతనాలను వేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉన్నత అధికారుల ఎదుట ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు దివాకర్, కమల్‌బాషా పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ స్కూటరిస్టు మృతి

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు-పులివెందుల రహదారిలోని నల్లబల్లె గ్రామ సమీపంలో సోమవారం ప్రమాదవశాత్తూ బైకు నుండి కిందపడి సురేష్ (30) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. కర్నూలు జిల్లా సంజామల మండలం రామిరెడ్డిపల్లెకు చెందిన సురేష్ పులివెందులకు చెందిన ఓ ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులో క్లీనర్‌గా పని చేస్తున్నాడు. విధులు ముగించుకుని బైకులో పులివెందుల నుండి స్వగ్రామమైన రామిరెడ్డిపల్లెకు వస్తుండగా ముద్దనూరు మండలం నల్లబల్లె గ్రామ సమీపంలో బైకు అదుపు తప్పి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.




మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

స్వాతంత్ర్య సమరయోధుల సంఘం జిల్లా అధ్యక్షులు మృతి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

స్వాతంత్ర్య సమరయోధుల సంఘం జిల్లా అధ్యక్షులు న్యాయవాది టేకూరు సురేష్‌కుమార్ (52) మృతి చెందారు. సురేష్ కుమార్ స్వాతంత్ర్య సమరయోధుడు టేకూరు సుబ్బారావు కుమారులు. అవివాహితుడైన సురేష్‌కుమార్ గుండెపోటుతో శనివారం రాత్రి మృతి చెంది ఉంటారనే అనుమానాన్ని స్థానికులు వ్యక్తం చేశారు. ఆదివారం తలుపులు తెరవకపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు రాత్రి బాగా పొద్దు పోయాక తలుపులు తెరిచి చూడగా సురేష్‌కుమార్ విగతజీవిగా పడి ఉన్నారు. ఆయన మృతికి సంతాప సూచకంగా ప్రొద్దుటూరు బార్ అసోషియేషన్ సభ్యులు సోమవారం విధులను బహిష్కరించారు.



సురేష్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

'మిట్స్'లో మెదడు పరిశోధనలపై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్‌లో రే ప్రోగ్రామింగ్ అఫ్ మైండ్‌పై అవగహన సదస్సును ఇంజినీరింగ్ మొదటి సంవత్సర విద్యార్థులకు నిర్వహించినట్లు ప్రిన్సిపిల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు పాల్గొన్నారన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదడుపై పరిశోధనలు జరిగిన కొద్దీ కొత్త కొత్త విషయాలు తెలుస్తూనే ఉంటాయన్నారు. మన మెదడు గురించి మనం తెలుసుకోవడం కూడా చాలా ఆసక్తికరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ అనంత విశ్వం గురించి పూర్తిగా తెలుసుకోవడం ఎంత కష్టమో, మనిషి మెదడు గురించి తెలుసుకోవడం కూడా అంతే కష్టమని తెలిపారు. మన మెదడు మెమరీ చిప్ లాంటిది, డేటాను నిల్వ చేసే సామర్థ్యం అపరిమితంగా ఉంటుందని తెలిపారు. ప్రతి విషయంలోనూ మన ఆలోచన విధానం చాలా ముఖ్యమని, ప్రతిధి పాజిటివ్‌గా థింక్ చేయాలన్నారు. ఆలోచన ప్రక్రియ ఒకరి విధి, గమ్యం హోదాను ప్రభావితం చేస్తాయని, ప్రతి ఒక్కరు తమ మైండ్ సెట్ పాజిటివ్‌గా థింక్ చేసేలా చూసుకోవాలని పేర్కొన్నారు. మనం ఆలోచించే విధానమే మన జీవితంలో ప్రతిదాన్ని నిర్ణయిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయని తెలిపారు. ఉదాహరణకు తరచూ చిరాకు పడే ఒక వ్యక్తి, తాను నిరుత్సాహంగా ఉండడమే కాక, చుట్టూ ఉన్న వ్యక్తులను కూడా నిరుత్సాహపరుస్తాడన్నారు. ఎప్పుడూ హుషారుగా పనిచేసే ఒక వ్యక్తి, తన చుట్టూ ఉన్న ప్రతి ఒక్కరినీ ఉత్సాహపరుస్తాడన్నారు. ప్రతి ఒక్కరు తమ తమ భావోద్వేగాలను, ఒత్తిడిని అధిగమించి శాంతంగా జీవించడానికి సహాయపడే ఆలోచనా విధానాన్నేఎంచుకోవాలని తెలిపారు. న్నారు. పాజిటివ్ థింకింగ్ మనల్ని మానసికంగా బలంగా చేస్తుంది అని, ఇబ్బందులను ఉత్సాహంతో ఎదుర్కోవడంలో మనకు సహాయపడుతుందని చెప్పారు.అంగవైకల్యం, ఆర్థిక స్థితిగతులు, కుటుంభ వాతావరణం లాంటివి కూడా మన ఆలోచన విధానం సక్రమంగా ఉన్నపుడు వాటిని అధిగమించి ఉన్నత శిఖరాలను పొందవచ్చని పేర్కొన్నారు. ఆ కోవలో ఐఎస్ టాపర్ అయిన ముత్యాల రాజు, చంద్రుడు మొదలైన వారు కొందరి ప్రత్యేక ప్రతిభావంతుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఫస్ట్ ఇయర్ కో-ఆర్డినేటర్స్ డాక్టర్ చంద్ర మోహన్, డాక్టర్ సుబ్బా రావు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ సుబ్బారావు

ఉగాది పురస్కారాలందుకున్న కవి 'జలకనూరి'



కవి జలకనూరిని సన్మానిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి-పీలేరు : ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం (భారతీయ భాషా సంస్థ, విద్యా మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం) నెల్లూరు, తిరుపతి రచయితల సంఘం వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించిన జాతీయ ఉగాది కవి సమ్మేళనాల్లో పీలేరుకు చెందిన పద్య కవి జలకనూరి మురళీధర్‌రాజు పురస్కారాలను అందుకున్నారు. సోమవారం ఆయన పీలేరులో మాట్లాడుతూ నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో జరిగిన కవి సమ్మేళనాల్లో తాను పాల్గొని నూతన తెలుగు క్రోధి నామ సంవత్సరం పురస్కరించుకుని, తెలుగు ఉగాది-కలుగు శుభాది అనే పద్య కవితను వినిపించినందుకు తనను ఆ సంస్థల అధ్యక్షులు మాడభూషి సంపత్ కుమార్ బృందం, తిరుపతి రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సాకం నాగరాజ, తోట వెంకటేశ్వరరావు లు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీవేంకటేశ్వర విశ్వ విద్యాలయ విశ్రాంత ఆచార్యులు దామోదర నాయుడు చేతులమీదుగా ఉగాది పురస్కారం ప్రధానం చేశారన్నారు. జ్ఞాపిక, ప్రశంసాపత్రాలతో సత్కరించారు.

లయన్స్ క్లబ్ ఉత్తమ జిల్లా చైర్మన్‌గా 'పోతుగుంట'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

లయన్స్ క్లబ్ ఉత్తమ జిల్లా చైర్మన్‌గా పోతుగుంట రమేష్ నాయుడు ఎంపికయ్యారు. ఆదివారం ప్రొద్దుటూరులో లయన్స్ క్లబ్ రీజియన్ క్లబ్ చైర్మన్ లయన్ చంద్రప్రకాష్ రావు ఆధ్వ ర్యంలో జరిగిన అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో రాజంపేటకు చెందిన లయన్స్ క్లబ్ చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు ఉత్తమ జిల్లా చైర్మన్‌గా అవా ర్డును అందుకున్నారు. ఉత్తమ రీజియన్ చైర్మన్‌గా షేక్ అబ్దుల్లా, ఉత్తమ అధ్యక్షు లుగా వై.సుబ్రహ్మణ్యం రాజు అవార్డులు అందుకున్నారని రమేష్ నాయుడు తెలియజేశారు. లయన్స్ క్లబ్ సేవ చేయడంలో సదా ముందు వరు సలో ఉంటుందని, అవార్డు అందు కోవ డం ఆనందంగా ఉందని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వ హించేందుకు ఉత్సాహాన్ని ఇచ్చిందని తెలిపారు.



అవార్డు అందుకున్న రమేష్‌నాయుడు, అబ్దుల్లా